
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
బుధవారం 1 జనవరి 2025





హుకుంపేట మండలం గడుగుపల్లిలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

న్యూ ఇయర్ సందడి

ఏజెన్సీకి భారీగా తరలి వచ్చిన పర్యాటకులు

- పర్యాటక ప్రాంతాలు కిటకిట
- బొర్రా గుహలు మొదలుకుని లంబసింగి వరకు రద్దీ

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):

మన్యంలో మంగళవారం న్యూ ఇయర్ జోష్ కనిపించింది. ఏడాది ముగింపు నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో పర్యాటకులు ఏజెన్సీకి వచ్చారు. దీంతో ఏజెన్సీలో ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. అనంతగిరి మండలం బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటకుల సందడి నెలకొంది.

నూతన సంవత్సర వేడుకలను పర్యాటక ప్రదేశాల్లో జరుపుకోవాలనే ఉద్దేశంతో స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎక్కువ మంది పర్యాటకులు ఏజెన్సీకి తరలి వచ్చారు. దీంతో అనంతగిరి మండలం బొర్రా గుహలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువులవేనం మేఘాలకొండ, లంబసింగి ప్రాంతాలు రద్దీగా మారాయి. కాగా ఆయా ప్రాంతాల్లో పలువురు న్యూఇయర్ ఈవెంట్‌లను ఏర్పాటు చేశారు. పాడేరు మండలం వంజంగి హిల్స్‌లో వివిధ ఈవెంట్‌లు, అన్‌లిమిటెడ్ ఫుడ్, డ్రింక్స్‌పై ఆఫర్లను సైతం ఇచ్చారు. పర్యాటకులు 2024కి వీడ్కోలు, 2025కు స్వాగతం పలుకుతూ ఎంజాయ్ చేశారు.



అరకులోయ గిరిజన మ్యూజియం ఆవరణలోని మర్రి కామయ్య సాంస్కృతిక కళా వేదికపై కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న పర్యాటకులు



అరకు గిరిజన మ్యూజియం వద్ద కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటున్న పర్యాటకులు

చెరువులవేనంలో పర్యాటకులు



అరకులోయలో..

అరకులోయ: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు మంగళవారం కిటకిటలాడాయి. లాడ్జిలు, రిసార్టులు పర్యాటకులతో నిండిపోయాయి. పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, ఘాట్‌రోడ్డులోని కాఫీ తోటలు, గాలికొండ వ్యూపాయింట్, మాడగడ సన్‌రైజ్ హిల్స్ రద్దీగా మారాయి.

న్యూ ఇయర్ వేడుకలు

అరకులోయ గిరిజన మ్యూజియం ఆవరణలోని మర్రి కామయ్య సాంస్కృతిక కళా వేదికలో న్యూ ఇయర్ వేడుకలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ధింసా నృత్యంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. మిమిక్రీ, పాటలు, డ్యాన్స్‌లతో కళాకారులు అలరించారు. రాత్రి 12 గంటల వరకు మ్యూజియానికి సందర్శకులను అనుమతించారు. పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50 చొప్పున టికెట్ రేటు నిర్ణయించారు.

లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగిలో పర్యాటకుల సందడి నెలకొంది. సంవత్సరం ఆఖరు కావడంతో మంగళవారం అధిక సంఖ్యలో పర్యాటకులు లంబసింగికి తరలి వచ్చారు. దీంతో చెరువులవేనం, లంబసింగి జంక్షన్, తాజంగి జలాశయం రద్దీగా కనిపించాయి. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు మంచు అందాలను తిలకిస్తూ ఎంజాయ్ చేశారు. పర్యాటకులు స్థానికంగా బస చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బుధవారం కూడా లంబసింగిలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉంది.



పాడేరు మండలం వంజంగి హిల్స్‌లో ఓ రిసార్ట్‌లో విద్యుత్ కాంతులు, పర్యాటకుల సందడి

తొలి రోజు 95.44 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 1,23,679 మంది

- ఒక్కరోజే 1,18,036 మందికి అందజేత
- పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న అధికారులు, కూటమి నేతలు

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తొలి రోజైన మంగళవారం 95.44 శాతం మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,23,679 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.51 కోట్ల 78 లక్షల 50వేల 500 నిధులను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా తొలి రోజు రాత్రి 8 గంటల్లోగా 1,18,036 మందికి రూ.49 కోట్ల 32 లక్షల 62 వేల 500 పింఛన్ సొమ్మును అందించారు. ఇంకా 5,643 మందికి అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలో తొలి రోజు పెన్షన్ల పంపిణీ 95.44 శాతంగా నమోదైంది. ఏదైనా కారణంతో మంగళవారం పెన్షన్ పొందని లబ్ధిదారులకు బుధవారం విధిగా అందిస్తామని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

హుకుంపేటలో కలెక్టర్ పంపిణీ

హుకుంపేట మండలంలో తాడిపుట్టు, గడుగుపల్లిలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళితో కలిసి పలువురు లబ్ధిదారులకు మంగళవారం పెన్షన్ సొమ్మును అందించి జిల్లాలోని సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతగిరి మండలంలో జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, పాడేరులో టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రంపచోడవరంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పింఛన్ల పంపిణీ ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని పెన్షన్ల పంపిణీలో కూటమి నేతలు పాల్గొన్నారు.

విశాఖ రేంజ్‌లో ఏడుగురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి?

- డీజీపీకి జాబితా

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

డీఎస్పీలుగా పదోన్నతికి అర్హులైన సీఐల జాబితాను అధికారులు మంగళవారం రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావుకు పంపించారు. ఆయన ఆమోదించి త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది. అధికారులు తయారుచేసిన సీనియారిటీ జాబితాలో విశాఖ రేంజ్ పరిధిలో సీఐలుగా పనిచేస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన పీవీవీ నరసింహరావు, వి.బాబ్జీరావు, ఎస్.ఆదం, ఆర్.నీలయ్య, జి.వెంకటరమణ, వి.చంద్రశేఖర్. టి.సీతారాం, ఎం.బుచ్చిరాజు, ఎస్.కాంతారావు పేర్లు ఉన్నాయి. వీరికి అడ్‌హాక్ పదోన్నతి లభించనుంది. వీరంతా 2009లో సీఐలుగా పదోన్నతి పొందారు. డీఎస్పీ పదోన్నతి కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు.



మీసేవా కేంద్రం వద్ద పంట బీమా నమోదు కోసం నిరీక్షిస్తున్న రైతులు

పంట బీమా నమోదుకు సాంకేతిక కష్టాలు

సర్వర్ మొరాయిస్తుండడంతో జాప్యం

- రాజ్‌మా పంట బీమా నమోదుకు ముగిసిన గడువు
- మరో అవకాశం ఇవ్వాలని రైతుల వేడుకోలు

చింతపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

రాజ్‌మా పంట బీమా నమోదుకు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచూ సర్వర్ మొరాయిస్తుండడంతో నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. పంట బీమా నమోదుకి డిసెంబరు 31తో గడువు ముగిసింది. మంగళవారం ఆఖరి రోజు కావడంతో మీసేవా కేంద్రాలకు రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. అయితే సర్వర్ నెమ్మదిగా పని చేయడంతో రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి పంట బీమా నమోదు గడువు పెంచాలని రైతులు బేరా సత్యనారాయణ పడాల్, లింగన్నపడాల్, బాలయ్యపడాల్ కోరుతున్నారు.

గిరిజన యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ - వార్త 8వ పేజీలో..

జల్ జీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఏజెన్సీలో శిశు మరణాలపై ఉన్నతాధికారులతో కమిటీ వేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):

ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి అందించే జల్ జీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. జిల్లాలోని అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా 2 లక్షల 38 వేల 319 ఇళ్లకు కుళాయిల ద్వారా నీళ్లు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనుల్లో ప్రస్తుతం లక్షా 20 వేల 931 ఇళ్లకు మాత్రమే కుళాయిలను ఏర్పాటు చేశారని, మిలిగిన లక్షా 17 వేల 388 ఇళ్లకు త్వరితగతిన కుళాయిలు సమకూర్చాలన్నారు. అలాగే రిజర్వాయర్ల ద్వారా నీటిని గ్రామాలకు అందించే అవకాశాలపై డీపీఆర్ రూపొందించాలని, విద్యుత్ మోటార్ల మరమ్మతులపై యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు.

శిశు మరణాలపై కమిటీ వేయాలి


ఏజెన్సీలో శిశు మరణాలకు గల కారణాలపై అధ్యయనం చేసేందుకు ఉన్నతాధికారులతో కమిటీని వేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. పలు ప్రాంతాల్లో అనారోగ్యానికి గురవుతున్న శిశువులకు పలువురు పసరు మందులు వేస్తుండడంతో మృత్యువాత పడుతున్నారని పలువురు డాక్టర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన దానిపై అధ్యయనం చేసేందుకు వైద్యులు, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రుల పనితీరు మెరుగుపడాలన్నారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తున్న సరకుల నాణ్యతను పరిశీలించాలని, అవి సక్రమంగా లేకుంటే టెండర్‌దారుడ్ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలన్నారు. జిల్లాలో స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా 90 శాతం ఇంటిపన్నులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి డీపీవో లవరాజును అభినందించారు. ప్రతి ఏడాది రెండో తేదీన గ్రామసభల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వభరత్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎల్.రజని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన డీఎంహెచ్‌వో జమాల్ బాషా

స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

కొనసాగుతున్న చలి ప్రభావం ▸ జి.మాడుగులలో 13.3, చింతపల్లిలో 13.6 డిగ్రీలు



ముంచంగిపుట్టులో మంగళవారం ఉదయం దట్టంగా కురుస్తున్న పొగమంచు

పాడేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండడంతో చలి ప్రభావం సైతం కొనసాగుతున్నది. దీంతో మంగళవారం జి.మాడుగులలో 13.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, చింతపల్లిలో 13.6, జీకేవీధిలో 14.3, అరకులోయలో 14.4, ముంచంగిపుట్టులో 14.6, అనంతగిరిలో 14.7, డుంబ్రిగుడలో 14.8, పెదబయలులో 15.2, పాడేరులో 15.5, హుకుంపేటలో 13.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.



పాడేరులో మంగళవారం ఉదయం పొగమంచు

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటల వరకు పొగమంచు వీడలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా చలి వణికిస్తోంది. ఉన్ని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

చిటికెలో కాఫీ సమాచారం

- 'కాఫీ కృషి తరంగ సేవ' కాల్ సెంటర్ సేవలు భేష్
- సకాలంలో కాఫీ రైతులకు సాగులో మెలకువలు, ప్రాంతీయ, అంతర్జాతీయ ధరల వివరాలు
- మిస్డ్‌కాల్‌తో ఉచిత సేవలందిస్తున్న కేంద్ర కాఫీ బోర్డు



కాఫీ కృషి తరంగ సేవ కాల్ సెంటర్ బ్రోచర్

చింతపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

గిరిజన కాఫీ రైతుల వాణిజ్య ప్రగతి కోసం కేంద్ర కాఫీ బోర్డు సుమారు రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 'కాఫీ కృషి తరంగ సేవ' కాల్ సెంటర్ విశేష సేవలు అందిస్తోంది. కాల్ సెంటర్‌కు రైతులు మిస్డ్‌కాల్ చేస్తే సాగులో మెలకువలు, సలహాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ ధరల వివరాలను చిటికెలో అందిస్తోంది. 24 గంటలూ దీని సేవలు అందుబాటులో ఉంటాయి.



కాఫీ పండ్లను యార్డుపై ఎండబెడుతున్న రైతు

గిరిజన ప్రాంతంలో 1960-70 ప్రాంతంలో కేంద్ర కాఫీ బోర్డు శాస్త్రవేత్త రాఘవేంద్ర ప్రయోగాల కృషి ఫలితంగా జిల్లాలోని పాడేరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గిరిజన రైతులు సంప్రదాయేతర పంటగా కాఫీని సాగుచేస్తున్నారు. జిల్లాలో గిరిజన రైతులు 2.58 లక్షల ఎకరాలు, ఏపీఎఫ్‌డీసీ 8,500ఎకరాల్లో కాఫీ సాగు చేపడుతున్నారు. కాఫీ సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు ఐటీడీఏ గిరిజన రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నది. కాఫీ రైతులు పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు, వాణిజ్య ప్రగతి సాధించేందుకు కేంద్ర కాఫీ బోర్డు అధికారులు కృషి చేస్తున్నారు.

సెల్‌ఫోన్ ద్వారా 'కాఫీ కృషి తరంగ సేవ'

కేంద్ర కాఫీ బోర్డు అధికారులు సెల్‌ఫోన్ ద్వారా 'కాఫీ కృషి తరంగ సేవ' కాల్ సెంటర్ సేవలు అందిస్తున్నారు. రైతులు 080-37685003 నంబరుకి మిస్డ్‌కాల్ చేస్తే చాలు వెంటనే కాల్ సెంటర్ నుంచి తిరిగి ఫోన్ వస్తుంది. తెలుగు భాషలోనే ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. కాల్ సెంటర్ రికార్డు వాయిస్‌ను రైతులు జాగ్రత్తగా విని అవసరమైన ఆప్షన్ ఎంచుకోవాల్సి వుంటుంది. కాల్ సెంటర్ నుంచి వచ్చిన కాల్ రిసీవ్ చేసుకున్న తరువాత రైతు ఒకటి నంబరును నొక్కి కాఫీ బోర్డు అధికారులను అడగదలుచుకున్న ప్రశ్నలను రికార్డు చేయవచ్చు. ఈ విధంగా అడిగిన ప్రశ్నకు కాఫీ బోర్డు అధికారులు తిరిగి కాల్ చేసి రైతులకు సమాధానం ఇస్తారు. రెండును ... మిగతా 10వ పేజీలో


పింఛన్ల పంపిణీలో శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకులు


పింఛన్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు

పింఛన్‌దారుల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

అనంతగిరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి సామాజిక పింఛన్ల మొత్తం పెంచడమే కాకుండా.. ప్రతి నెలా ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తోందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కాశీపట్నం, కొత్తూరు పంచాయతీల్లో మంగళవారం ఉదయం ఏడు గంటకే నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కిడారి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆలోచనలను అమలు చేయడంలో ప్రస్తుతముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఒంటరి, వితంతువులకు, వృద్ధులకు రూ. 4వేలు పింఛన్, దివ్యాంగులకు రూ.6వేలు పిం చన్, సికిల్‌సెల్ ఎనీమియా తదితర వ్యాధులకు సంబంధించి రూ. 15వేల పింఛన్లతో భరోసా కల్పిస్తున్నారన్నారు. అభయహస్తం కింద డ్వాక్రా మహిళలకు రూ.500 ఇస్తున్నారని గుర్తుచేశారు. ప్రతి కుటుంబానికి అండగా నిలిచేలా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, కార్యవర్గ సభ్యుడు జోగులు, కొత్తూరు ఉపసర్పంచ్ నరేంద్ర, నిర్మల, లక్ష్మణ్‌రావు, శివ, శ్యామ్, సుందరరావు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎర్రిబాబు, పుష్పనందం, ఎంపీడీవో కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్ఐ శంకరరావు, పాల్గొన్నారు.

ఒక రోజు ముందు పింఛన్ల పంపిణీ ఘనత: గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా ఒక రోజు ముందుగానే మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తయిందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జనవరి ఒకటో తేదీన నూతన సంవత్సరం కావడంతో డిసెంబరు 31వ తేదీ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షించాల్సిన విషయమన్నారు. మంగళవారం ఆమె చింతలవీధి పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ల పంపణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఎస్‌వీ రమణమూర్తి, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, బూత్ కన్వీనర్ సొలేబు అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి మాట్లాడారు. లబ్ధిదారులకు ఒకటో తారీఖునకు ముందే అందజేయడం ఆనందదాయకమన్నారు.పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. పలువురు నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల ఉద్యోగుల దీక్షలు విరమణ

» మంత్రి హామీతో తాత్కాలికంగా నిరసన నిలిపివేత
» అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండబాబు


దీక్షలను విరమిస్తున్న ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గురుకులాల ఉపాధ్యాయ, అధ్యాపకులు సమస్యలపై చేపడుతున్న నిరాహార దీక్షలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హామీ మేరకు మంగళవారం తాత్కాలికంగా విరమించినట్టు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఎల్.కొండబాబు, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులు తమను సీఆర్టీలుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, ఐటీడీఏ ఎదుట 47 రోజులుగా రిలే దీక్షల కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధులు కొండబాబు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ నెల 29వ తేదీన అఖిల భారత గిరిజన ఉద్యో గుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కిల్లు గంగన్న పడాల్, ఏపీ గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పలాసి కృష్ణారావులు మంత్రి గుమ్మడి సంధ్యారాణిని సాలూరులో ఆమె నివాస గృహంలో కలిసి గురుకులాలల్లోని ఉద్యోగుల సమస్యలపై చర్చించారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాల పెంపు, అవుట్ సోర్సింగ్ పద్ధతి నుంచి సీఆర్టీలుగా మార్పు తదితర అంశాలపై చర్చించామన్నారు. ఈ సమస్యలపైసానుకూలంగా స్పందించిన మంత్రి రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమింపజేయాలని కోరారన్నారు. మంత్రి మౌఖిక ఆదేశాల మేరకు దీక్షలను తాత్కాలికంగా విరమించామన్నారు. . ఈ సందర్భంగా శిబిరంలో ఉన్న ఉద్యోగులకు నలుగురు కమిటీ గల సభ్యులు నిమ్మరసం అందించి దీక్షలను విరమింపజేయించారు.

గిరిజన యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు: కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపడతామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధిపై మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని యూత్ ట్రైనింగ్ సెంటర్లు, పాలిటెక్నిక్, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో, ఐటీఐల్లో యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అందిస్తామన్నారు. అలాగే లొంగిపోయిన మావోయిస్టులకు టైలరింగ్ వంటి ఉపాధి శిక్షణలు అందించాలని, ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వున్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోని స్కిల్ డెవలప్‌మెంట్‌పై సర్వే నిర్వహించాలని ఐటీడీఏల పీవోలకు కలెక్టర్ సూచించారు. ఐటీడీఏల పరిధిలో నైపుణ్యాభివృద్ధిపై కార్యక్రమాలు చేపట్టడం, ప్రతి నెలా వాటిపై సమీక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి, ఎల్‌డీఎం మాతునాయుడు, స్థానిక డి గ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టిబ్బాయి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ న ంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్ రావు, జిల్లా ఉపాధి కల్పానాధికారి ఎ.సంగీత, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది, వర్చువల్‌గా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వభరత్ పాల్గొన్నారు.


సమావేశంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, డ్వామా పీడీ విద్యాసాగర్

గరిమండలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

కొయ్యూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ప్రాబల్య గరిమండ గ్రామంలో 170 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాలకు మంగళవారం సర్పంచ్ ముత్యాలమ్మ శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లలో కనీసం రహదారి సౌకర్యానికి నోచని మండలంలో 33 గ్రామాల సమాహారంలో అతిపెద్ద బూదరాళ్ల పంచాయతీ పరిధి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపడుతుండడంతో జనాలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పలు గ్రామాలకు రహదారులు నిర్మాణాలకు, మౌలిక వసతుల కల్పనకు చర్యలతో పాటు సీసీ రోడ్లు నిర్మించటం అదృష్టంగా భావిస్తున్నామని ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు కుమారి, వార్డు సభ్యుడు సంజీవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు నారాయణ, నేతలు కూనిశెట్టి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం అధ్వాన స్థితిపై ఫిర్యాదు


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ముంచంగిపుట్టు గ్రామస్థులు, క్రీడాకారులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హోలీ క్రీడా మైదానం నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని కోరుతూ స్థానిక క్రీడాకారులు, యువకులు ఎంపీడీవో శ్రీసాయిహర్షకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడా మైదానంలోకి మురుగు నీరు వచ్చేస్తోందన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారన్నారు. మండలంలో 23 పంచాయతీల క్రీడాకారులకు ప్రధానంగా నిలుస్తున్న ఈ మైదానం బాగోగులపై అధికారులు సారించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్రీడలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వివరించారు. మురుగునీటిలో నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్త, మురుగునీరు తొలగించేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్య క్రమంలో క్రీడాకారులు సాయికిరణ్, శ్రీధర్, లింకన్, హరిష్, సాయి, లంబు పాల్గొన్నారు.

చదువు విషయంలో అశ్రద్ధ వహించొద్దు

» ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువు అశ్రద్ధ చేయకుండా భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు. మండలంలోని గిరిజన ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. పదో విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠ్యాంశాలను చదివించారు. పరీక్షలు దగ్గర పడుతుందని శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. పరీక్షలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయుల మరింత శ్రద్ధ వహించాలని కోరారు. భోజనాల మెనూను పరిశీలించారు. అనంతరం నందివలస గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్నం భోజనాలకు సిద్ధం చేసిన వంకాయ, శనగపప్పు కూరను పరిశీలించారు. కూరలో నూనె కొరత, పోపులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు ఇలానే పెడతారా అని ఆ పాఠశాల యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేశారు. సమీపంలో నిర్మితమవుతున్న పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడుతున్నారని కాంట్రాక్టర్‌పై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రామారావు, నాయకులు తుమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాథరావునాయుడు

పాడేరురూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి భూ సమస్యలపై అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు అన్నారు. మండలంలోని గొండెలి పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో మ్యుటేషన్‌లు, భూ సరిహద్దు సమస్యలు, భూ తగాదాలపై 175 మంది ఫిర్యాదులు అందాయన్నారు. భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తున్నామన్నారు. అదే విధంగా భూముల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. జనవరి 10వ తేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సులను ఆయా పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ కూడా భాస్కరరావు, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వో కె.ప్రేమ్‌చంద్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలో చౌక ధరల దుకాణాలకు సంబంధించి ఖాళీల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డిపోలకు సంబంధించి డీలర్‌లు రాజీనామా, మరణం లేదా రేషన్ కార్డులు సర్దుబాటు తదితర కారణాలతో కొత్తగా ఏర్పాటుచేసిన డిపోలకు డీలర్లను నియమించ నున్నామన్నారు. పాడేరు డివిజన్‌లో ఇప్పటి వరకు గుర్తించిన 30 ఖాళీలను శాశ్వత ప్రాతిపదిన నియమించేందుకు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందన్నారు. అర్హత, ఆ సక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను ఆయా తహసీల్దార్ కార్యాలయంలో లేదా సబ్ కలెక్టర్ కార్యాలయంలో జనవరి 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నేరుగా అందజేయాలన్నారు.

'పర్యవేక్షణా లోపంతోనే అత్యాచార ఘటన'

» మహిళా సంఘాల ప్రతినిధులు


బాలికపై అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసన చేపడుతున్న మహిళా నేతలు

పాడేరురూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండల కేంద్రంలో ఓ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినిపై అత్యాచారం ఘటనలో పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని, ఈ నేపథ్యంలో వారిని బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయాలనిమహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. డిసెంబరు 25వ తేదీన యాజమాన్యం అనుమతితో బాలికను ఆమె పిన్ని మార్కెట్‌కు తీసుకువెళ్లి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి సాయంత్రం తిరిగి పాఠశాలలో అప్పగించినట్లు సీసీ కెమెరాలో స్పష్టంగా ఉందన్నారు. అయితే, విద్యార్థినిపాఠశాలకు రాలేదంటూ యాజమాన్యం దబాయించడం చూస్తుంటే వారి నిర్లక్ష్యం స్పష్టమవుతోందన్నారు. ఆ పాఠశాలలో ఎవరు ఉంటున్నారో, బయటకు ఎవరు వెళ్తున్నారో కూడా పట్టించుకోని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు గడిచినా, తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారమీయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, స్కూల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు కె.లతకుమారి, బి.రాణి, విమల, స్వరూప, కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వన భోజనాలు

జి.మాడుగుల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల కళాశాలలో మంగళవారం వనభోజనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పారయ్య మాట్లాడుతూ, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతాశిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో చక్కటి ఆలోచనలు పెంపొందించేలా ఇళ్లలోనినుంచి వారు వచ్చినప్పుడు సూచించాలని తల్లిదండ్రులకు కోరారు. పలు నృత్యాలతో కళాశాల విద్యార్థులు అలరించారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఏపీటీఎఫ్ నేతలు

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ముద్రించిన 2025 క్యాలెండర్, డైరీలను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించా రు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నేతలు ఎ.శ్యామ్‌సుందర్,. కె.ధనుర్జయ్, ఎస్.శాంతకుమారి, డి.సన్యాసిరావు, బిసోంబాబు, కె.పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన అధికారి సేవలు అభినందనీయం: ఎంపీపీ


ఏవో రవీంద్ర దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులు

చింతపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పరిపాలన అధికారి (ఏవో) ఆకోజు రవీంద్ర సేవలు అభినందనీయమని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. మంగళవారం పదవీ విరమణ పొందిన ఏవోను మండల పరిషత్ ఉద్యోగులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ రవీంద్ర టైపిస్టుగా తొలుత అనంతగిరిలో విధుల్లో చేరారన్నారు. వృత్తిపై అంకిత భావంతో ఏవో స్థాయికి చేరుకున్నారన్నారు. చింతపల్లిలో ఏడాదిగా ఆయన స్థానికంగా అందుబాటులో ఉంటూ కార్యాలయాన్ని సమర్థవంతంగా నడిపించారన్నారు. ఆయన శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ఏవో రవీంద్ర, శ్యామల దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో జ డ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, వైస్ ఎంపీపీలు వెంగళరావు, గోపీనాయక్ శారద, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రిటైర్డ్ ఎంపీడీవో రవి రత్నకుమార్ పాల్గొన్నారు. 31సీటీపీ12 ఏవో రవీంద్ర దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు

పెసా ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలి: ఎంపీడీవో



ఏవో రవీంద్ర దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులు

హుకుంపేట డిసెంబరు 31 ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పెసా కమిటీ ఎన్నికలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని 33 పంచాయతీలకు చెందిన ప్రజా ప్రతినిధులతో మండల పరిరిషత్ కార్యాలయంలో పెసా ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయితే, సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు కేవలం 15మంది మత్రమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తమ పంచాయతీలకు చెందిన షెడ్యూలు ప్రకారం జనవరి 3వతేదీ నుంచి 7వతేదీ వరకు పెసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయా గ్రావల్లో ఎస్టీలు ఎన్నికల్లో పాల్గొవాలన్నారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. మండలం మొత్తం పెసా కమిటీ ఎన్నికలు 351 చోట్ల నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నిలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, వైఎస్ ఎంపీపీ కొండలరావు, మండల పర్యవేక్షణ ఆధికారి అప్పలరాజు, ఏవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

సీలేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పేరుతో ఆచారాలు , సంప్రదాయాలు అం టూ గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని సీలేరు ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేరులతో మాట్లాడారు. జూదం వ్యసనంతో ప్రజలు జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. అంటువంటి వాటిని గ్రామాల్లో ఎ వరైనా పోత్సహించి నిర్వహిస్తే ముందుగా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడిపందెలు, కోడి కత్తెలు తయారీ తదితర వా టిలో నిందితులపై రాష్ట్రంలో పలు జిల్లాల్లో బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు వివరించారు.సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలంతా అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి తమకు సహకరించాలన్నారు.


ఎస్ఐ రవీంద్ర

నూతన సంవత్సర సందడి

» మార్కెట్‌లో కేక్‌లు, పండ్లు, పూల బొకేలకు గిరాకీ » అధిక ధరలకు విక్రయాలు


మార్కెట్‌లో పండ్లు, బొకేలు


బ్యాకరీ వద్ద కొనుగోలు దారుల రద్దీ

పాడేరురూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పాడేరులో నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం నుంచి పట్టణంలో పండ్లు, బొకేలు, రంగులు, కేకులు విక్రయాలు జోరుగా సాగాయి. దీంతో మార్కెట్ కొనుగోలు దారులతో రద్దీగా మారింది. కమల పండ్లు రూ. 100కి నాలుగ, యాపిల్స్ రూ. 100కి మూడు విక్రయాలు చేపట్టారు. పూల బొకేలు రూ. 300 నుంచి రూ. 450 వరకు ధరలు పలికాయి. కొనుగోలుదారులు ఎక్కడా వెనుకాడకుండా కొనుగోలు చేశారు. చిన్నారులు సైతం నూతన సంవత్సర వేడుకలసంబంధించి గ్రీటింగ్ షాపులు, కేక్‌ల కోసం బ్యాకరీల వద్దకు పరుగు తీశారు. యువతులు, మహిళలు ఇళ్ల వాకిట్లలో పోటాపోటీగా ముగ్గులతో అలంకరించారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు చేయాలి

▸ గిరిజన సంఘం ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు కేటాయించినట్లే అర్హులైన గిరిజనులందరికీ గృహాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు నిరసన వ్యక్తంచేశారు. ప్లకార్డులతో ర్యాలీగా వచ్చి ఆవరణలో బైఠాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గిరిజనులందరికీ పీఎం జన్‌మన్ గృహాలు మంజూరు చేయాలని, గతంలో మంజూరైనా అర్ధాంతరంగా నిలిచిపోయిన గృహాలకు సైతం బిల్లులు అందించాలని కోరారు. గృహాలు కేటాయింపు పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు గాసీరాందొర, నరసింగరావు, బాలరాజు, సొన్ను పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

నీటి కందకాల లక్ష్యాల పూర్తికి కృషి

▸ డ్వామా పీడీ డాక్టర్ విద్యాసాగర్


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ విద్యాసాగర్

కొయ్యూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నీటి కందకాల లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ డీవీ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం గదబపాలెంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలించారు. చిట్టింపాడులో నీటి కందకాల నిర్మాణాల కొతలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ప్రతి మండలంలో 100 పైగా నీటి కందకాలను నిర్మించాలన్నారు. నీటి కందకాల వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. అలాగే ఉద్యాన పంటల సాగులో నూ రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలని, గరిష్ఠంగా రూ.300వేతనం పొందేలా ఉపాధి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న వారందరికీ పని కల్పించాలన్నారు. అభివృద్ధి పనులకు పెద్దపీట వేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

చింతపల్లి: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై రైతులు చైతన్యవంతులు కావాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని రేలంగి, కొండవంచుల గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులు సేంద్రీయ పద్ధతులను పాటించాలన్నారు. రబీలో రైతులు పంట పొలాలను ఖాళీగా విడిచిపెట్టరాదన్నారు. నీటి సదుపాయం ఉంటే వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు సాగు చేసుకోవాలన్నారు. వర్షాధారంగా పెసర, మినుము, ఉలవలు నాటాలని కోరారు. పెసర, మినుము పంటలను సాగుతో మొక్కల వేర్లలోనున్న రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని సేకరించుకుని భూమిలో స్థిరీకరిస్తుందన్నారు. దీంతో నేలలో నత్రజని పెరుగుతుందని, ఖరీఫ్‌లో సాగుకు అవసరమైన నత్రజని అందుతుందన్నారు.

బీమాకు అధిక మొత్తం వసూలు చేస్తే చర్యలు: ఏవో

▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


మీసేవ కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏవో

గూడెంకొత్తవీధి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట బీమా నమోదులో అధిక నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏవో మధుసుదనరావు హెచ్చరించారు.మంగళవారం 'పంట బీమా నమోదులో మీ-సేవా నిర్వాహకుల దోపిడి' శీర్షికన 'ఆం ధ్రజ్యోతి'లో కథనం ప్రచురించింది. స్పందించిన ఏవో మీసేవా కేంద్రాలను సందర్శించారు. పంట బీమా నమోదుకి రైతుల నుంచి తీసుకుంటుంటున్న నగదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరా పంట బీమా నమోదుకు రూ.300 ప్రీమియం చెల్లించాలని, మీ-సేవా నిర్వాహకులు కేవలం నిబంధనల మేరకు సర్వీసు చార్జీగా రూ.50మాత్రమే తీసుకోవాలన్నారు. అదనంగా నగదు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన యువకుడు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పెదవలస- కొయ్యూరు ప్రధాన రహదారి బొంతువలస ఘాట్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కితాబు గ్రామానికి చెందిన వంతల రాజు, వంతల దాసు ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి బొంతువలస వెళ్తుండగా ఘాట్ రోడ్డులో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి లోనయింది. దీంతో ఆ ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో కాఫీ పండ్లు సేకరిస్తున్న గిరిజనులు ఫోన్‌లో సమాచారమిచ్చారు. వెంటనే వచ్చి క్షతగాత్రుల ను అంబులెన్సులో పెదవలస పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చీరలు వితరణ

చింతపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబరడ పంచాయతీ కృష్ణాపురంలో వృద్ధులు, మహిళలకు హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు చీరలు పంపిణీ చేశారు. మంగళవారం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ యు. లక్ష్మణరావు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించారు. యువతీ, యువకులు ప్రదర్శించిన క్రిస్మస్ గీతాలు అలరించాయి. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు సొంత నిధులతో కొనుగోలు చేసిన చీరలను మహిళలు, వృద్ధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు టి. మల్లేశ్, సభ్యులు బి.సింహాచలం, ఇమ్మానుయేలు, రామయ్య, సన్నీ, సంఘ పెద్దలు ఎస్. నూకరాజు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులపై దౌర్జన్యం సరికాదు'

పాడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలంలో ఓ గురుకులంలో ఉపాధ్యాయులు, సిబ్బందిపై పలువురు తల్లిదండ్రులు, సీఐ జీపు డ్రైవర్ నాని దౌర్జన్యానికి పాల్పడడం సరికాదని ఏపీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జీవీవీ.ప్రసాద్, టి.నాగేశ్వరరావు అన్నారు. ఆశ్రమ పాఠశాలలు ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నా హెచ్ఎం. ఉపాధ్యాయులను బాధ్యులను చేసి, వారిపై దౌర్జన్యాలకు పాల్పడడం ఘోరమన్నారు. సెలవుల్లోనూ విధులు నిర్వహిస్తున్నతమపై అకారణంగా దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కా కుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజాసంఘాలు సహకరించాలని కోరారు.

సూక్ష్మ కళతో కొత్త ఏడాదికి స్వాగతం

» పెన్సిల్ ముల్లుపై 2025ను అద్భుతంగా చెక్కిన గోపాల్

మాడుగుల రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్ మరోసారి తన కళాప్రతిభను చాటాడు. పెన్సిల్ ముల్లుపై '2025' అంకెలను చక్కగా చెక్కాడు. దీనిని రూపొందించ డానికి రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ చెప్పాడు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సూక్ష్మ కళాఖండాలు తయారు చేయడం ఇతని ప్రత్యేకత.



పెన్సిల్ ముల్లుపై 2025 (ఇన్‌సెట్‌లో) సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్

చెక్కపై న్యూ ఇయర్



చెక్కతో చేసిన చేతిపై 2025

నక్కపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన కళాకారుడు దార్ల రవి నూతన సంవత్సరం సందర్భంగా చెక్కపై చేతిని తయారు చేసి దానిపై '2025' అంకెను రూపొందించాడు. దీనిని తయారు చేయడానికి గంట న్నర సమయం పట్టిందని చెప్పాడు. వృత్తిరీత్యా కార్పెంటర్ అయిన ఇతను ప్రత్యేక రోజుల్లో ఆయా ఇతివృత్తాలను ఆవిష్కరించేలా కళారూపాలను తయారు చేస్తుంటాడు.

మహిళను బెదిరించి నగదు అపహరించిన నిందితురాలి అరెస్టు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మహిళను కత్తులతో భయపెట్టి నగదు అపహరించిన కేసులో ఒక నిందితురాలిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు చెందిన ఏపీ జెన్కో ఉద్యోగిని చెక్కా సుధ అక్టోబరు నాలుగో తేదీన గాజువాక వెళ్లడానికి అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో మరో ఇద్దరు మహిళలు వున్నారు. ఆటో జలగలమదుం జంక్షన్ వద్దకు చేరగానే ఇద్దరు మహిళలు కత్తులతో బెదిరించి సుధ నుంచి లక్షా 80 వేల రూపాయల నగదును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్‌ను అప్పట్లోనే అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితుల్లో ఒకరైన గంటా కాశేశ్వరిని సుంకరమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈమె స్వస్థలం విజయనగరం జిల్లా కొత్తవలస. ఈ కేసులో మరో నిందితురాలి కోసం గాలిస్తున్నామని పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

» ఉమ్మడి విశాఖ జిల్లాకు నాలుగు పతకాలు

చోడవరం, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కోల్‌కతా విసుధన్ విద్యాలయంలో నిర్వహించిన 5వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు స్వర్ణ పతకంతో పాటు రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. సబ్ జూనియర్ పోమ్‌సే విభాగంలో విశాఖ సిటీ ఆరిలోవకు చెందిన తన్విత్ బంగారు పతకంతో పాటు, క్యోరుగి అండర్ 32 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ఆరిలోవకు చెందిన జి.కారుణ్య ప్రసాద్ కేడెట్ డివిజన్ పోమ్‌సే వ్యక్తిగత విభాగంలో రజత పతకం, డివిజన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చంద్ర మౌళి, తదితరులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు

టీడీపీ నేతలపై దాడి కేసులో నిందితుల అరెస్టు

చోడవరం/బుచ్చెయ్యపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠ, అతని సోదరుడు శ్రీనివాసరావులపై దాడికి పాల్పడిన బుచ్చెయ్యపేట మండలం వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, అతని కుటుంబీకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. దిబ్బిడికి చెందిన టీడీపీ నాయకులు మణికంఠ, అతని సోదరుడిని సోమవారం ఆ గ్రామానికే చెందిన వైస్ ఎంపీపీ చినబాబు, అతని కుమారులతో పాటు, ఇతర బంధువులు దాడి చేసిన సంగతి తెలిసిందే. మణికంఠ తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు గొంపా చినబాబు, సియ్యాద్రి జనార్దన్, రాజేశ్, తేజ, హేమంత్, వర్ధన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు బుచ్చెయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

చిటికెలో కాఫీ సమాచారం

... 7వ పేజీ తరువాయి

నొక్కితే కాఫీ సాగులో ప్రస్తుత సీజన్‌లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, సాగులో మెలకువలను శాస్త్రవేత్తలు తెలియజేస్తారు. మూడో నంబరును నొక్కితే కాఫీ పార్చిమెంట్, చెర్రీ(గుళ్ల) ప్రాంతీయ, అంతర్జాతీయ మార్కెట్ ధరలను తెలుసుకోవచ్చు. నాలుగును నొక్కితే గతంలో కాఫీ బోర్డు అధికారులను అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను తిరిగి వినే అవకాశముంది. ఈ సేవలను కాఫీ రైతులు బాగా వినియోగించుకుంటున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగం



కాఫీ కృషి తరంగ సేవ కాల్ సెంటర్ ద్వారా రైతులకు విశేష సేవలు అందుతున్నాయి. రైతులు సెల్‌ఫోన్ ద్వారా ఉచితంగా కాఫీ బోర్డు కాల్ సెంటర్ సేవలు పొందవచ్చు. కాల్ సెంటర్ నంబరును ప్రతి రైతు సెల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. రైతులు కాఫీ బోర్డు కార్యాలయానికి వచ్చి నేరుగా సలహాలు, సూచనలు పొందవచ్చు. కాఫీ ధరలు సైతం రైతులు తెలుసుకోవచ్చు.

- ఎస్.రమేశ్, ఎస్ఎల్‌వో, కేంద్ర కాఫీ బోర్డు, పాడేరు

ఎప్పటికప్పుడు ధరలు తెలుసుకోవచ్చు



రైతులు కాఫీ బోర్డు ద్వారా ప్రాంతీయ, అంతర్జాతీయ మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కాఫీ గింజలను విక్రయించుకోవాలి. ధరలు తెలియకపోవడం వల్ల దళారులు చెప్పిన ధరకు విక్రయించుకుని నష్టపోవాల్సి వస్తుంది. పాడేరు, అరకు, చింతపల్లి కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయాల్లో కాఫీ ధరలు తెలియజేస్తారు. అలాగే కాఫీ కృషి తరంగ సేవ ద్వారా తాజా మార్కెట్ ధరలు తెలుసుకోవచ్చు. రైతులు కాఫీని పార్చిమెంట్‌గా చేసుకుని విక్రయించుకుంటే అధిక ధర లభిస్తుంది.

- జైతి ప్రభాకరరావు, వాణిజ్య విభాగం కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు